సాక్షి
రంగారెడ్డి
గురువారం । 4 । జూలై । 2024



చెరువులను సంరక్షించాలి
కబ్జాలకు గురవుతున్న చెరువులను కాపాడాలని మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహ డిమాండ్ చేశారు. 8లో▸



'రైతు భరోసా'కే..
రైతుకు భరోసా ఇచ్చేందుకు ప్రభుత్వం అభిప్రాయాలు సేకరిస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. 8లో▸



అజీజ్‌నగర్ సందర్శన
అజీజ్‌నగర్ పంచాయతీని ట్రైనీ అధికారులు సందర్శించారు. గ్రామంలో జరిగిన అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు. 8లో▸

న్యూస్‌రీల్

అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నాం

జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి



కేసీతండాలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి

కందుకూరు: అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామని జెడ్పీచైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మహేశ్వరం మండల పరిధిలోని కేసీతండా, ఆకన్‌పల్లి, పోరండ్ల, సుభాన్‌పూర్, అయ్యవారిపల్లి, నల్లచెరువుతండా, పెద్దమ్మతండా, చిన్నతూప్రా, అమీర్‌పేట గ్రామాల్లో జెడ్పీ నిధులు రూ.87.10 లక్షలతో ఇన్‌చార్జి ఎంపీపీ సునీతఆంధ్యానాయక్‌తో కలిసి అభివృద్ధి పనులకు ఆమె శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనితారెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టినట్టు చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో జిల్లా పరిషత్‌కు అదనంగా నిధులు తెచ్చి గ్రామాలను మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ప్రాధాన్యతా క్రమంలో త్వరలో అన్ని పనులు పూర్తయ్యేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు సువర్ణ, రాయప్ప కుమారి తదితరులు పాల్గొన్నారు.

విరివిగా మొక్కలు నాటండి

టీఎస్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్



తలకొండపల్లిలో మొక్కలు నాటుతున్న లక్ష్మీనివాస్ తదితరులు

తలకొండపల్లి: విరివిగా మొక్కలు నాటి పచ్చదనం వెల్లివిరిసేలా గ్రామాలను తీర్చిదిద్దాలని టీఎస్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్ పేర్కొన్నారు. పచ్చని చెట్లు–ప్రగతికి మెట్లని, చెట్లుంటే క్షేమం, లేకుంటే క్షామం అన్నారు. మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయం ఆవరణలో బుధవారం టీఎస్ఎస్ఓ ఆధ్వర్యంలో తహసీల్దార్ రంగారెడ్డితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా లక్ష్మీనివాస్ మాట్లాడుతూ.. సమస్త ప్రాణ కోటికి చెట్లే ప్రాణాధారమని తెలిపారు. మొక్కల పెంపకంతో విస్తారంగా అడవులు అభివృద్ధి చెందే అవకాశం ఉందని అన్నారు. అడవులతో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి వ్యవసాయ రంగం గణనీయంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. రైతులు సంవత్సరానికి రెండు పంటలను సునాయసంగా పండించుకోవచ్చని చెప్పారు. తద్వారా దేశంలో ఆకలి కొరత తీరి ప్రపంచ దేశాలకే భారతదేశం అన్నపూర్ణగా ప్రసిద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో టీఎస్ఎస్ఓ రాష్ట్ర, జిల్లా నాయకులు బాల్‌రాజ్, సుదర్శన్, మధు, మహేశ్, సురేష్, వెంకటేశ్, నరేష్‌చారి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర భవిష్యత్తుకు మొక్కలు నాటాలి



విద్యార్థులతో కలిసి మొక్కలు నాటుతున్న మురళి

నందిగామ: ప్రతి ప్రాణికి సుస్థిర భవిష్యత్తు ఉండాలంటే అందరూ మొక్కలు నాటడమే కాకుండా, వాటిని సంరక్షించాలని జీ20 ఇన్షియేటివ్ డైరెక్టర్ మురళి అన్నారు. మండల పరిధిలోని కన్హా శాంతి వనంలో యునైటెడ్ నేషన్స్ కన్వెన్షన్స్ టు కంబాట్ డే సర్టిఫికెషన్ (యూఎన్‌సీసీడీ) జీ20 గ్లోబల్ ల్యాండ్ ఇన్షియేటివ్, హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్‌స్టిట్యూట్ సహకారంతో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి మురళి ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అతిపెద్ద ధ్యాన కేంద్రమైన కన్హా శాంతి వనంలో హైదరాబాద్‌లోని పలు పాఠశాలలకు చెందిన సుమారు 2,500 మంది విద్యార్థులు మొక్కలు నాటేందుకు ముందుకు రావడం హర్షించదగ్గ విషయమని అన్నారు. విద్యార్థులకు చిన్నప్పటి నుంచే పర్యావరణంపై అవగాహన కల్పించినట్లయితే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడమే కాకుండా సంరక్షిస్తారని తెలిపారు. కార్యక్రమంలో కన్హా శాంతి వనం ఫారెస్ట్ చైర్మన్ రమాకాంత్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



బిల్లుల కోసం పాడి రైతుల ధర్నా (ఫైల్)

డెయిరీ డీలా

ప్రభుత్వ డెయిరీలకు నిర్లక్ష్యపు జబ్బు

- అమ్మకాల్లో ప్రైవేటుతో పోటీపడలేక వెనుకంజ
- ప్రజల్లో ఆదరణ ఉన్నా 'క్యాష్' చేసుకోలేని పరిస్థితి
- పేరుకుపోయిన పాల బకాయిలు
- బిల్లుల కోసం రైతుల ఆందోళన

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రభుత్వ డెయిరీలకు నిర్లక్ష్యపు జబ్బు పట్టింది. ఆయా డెయిరీల పాల ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి ఆదరణ ఉంది. కానీ ఆశించిన సమయంలో ఇంటింటికీ సరఫరా చేయలేకపోతున్నాయి. ఫలితంగా నష్టాలను మూటగట్టుకోవాల్సి వస్తోంది. రైతులకు పెద్ద మొత్తంలో బిల్లులు బకాయి పడాల్సి వస్తోంది. విజయ డెయిరీ రెండు నెలల బిల్లు చెల్లించాల్సి ఉండగా, మదర్ డెయిరీ పదిహేను రోజులకు సంబంధించిన రూ.2.50 కోట్లు చెల్లించాల్సి ఉంది. సమయానికి బిల్లులు రాకపోవడంతో పాడి నిర్వహణ రైతులకు భారంగా మారుతోంది. ఉపాధి కోసం ప్రత్యామ్నాయ మార్గాన్ని వెతుక్కోవాల్సిన వస్తోంది.

సాధారణంగా ఆవు పాల బేసిక్ ఫ్యాట్ 3 నుంచి 4.5 ఉండగా, గేదె పాలు 5 నుంచి 10 ఫ్యాట్ ఉంటుంది. ఆవుపాలకు లీటర్‌కు రూ.40 నుంచి రూ.43 వరకు చెల్లిస్తుండగా, గేదె పాలకు రూ.50 నుంచి రూ.80 వరకు చెల్లిస్తున్నారు.

అధిక ధర.. తక్కువ కమీషన్

గ్రేటర్ జిల్లాల్లో రోజుకు సగటున 28 లక్షల లీటర్ల పాలు అవసరం. విజయ, మదర్‌డెయిరీతో పాటు తిరుమల, మస్కతి, కరీంనగర్ డెయిరీ, దొడ్ల, నేచురల్, ఆరోగ్య, ప్రియ, కృష్ణ విజయ, అమూల్ తదితర డెయిరీల పాలు విక్రయిస్తున్నారు. మస్కతి సహా ఇతర కంపెనీలు ఔట్‌లెట్ ఏజెంట్లకు లీటరుకు రూ.10 వరకు కమీషన్ ఇస్తున్నాయి. ప్రభుత్వ డెయిరీలు రూ.4 నుంచి రూ.5 మాత్రమే చెల్లిస్తున్నాయి. దీంతో మెజార్టీ వ్యాపారులు కమీషన్ ఎక్కువగా ఇచ్చే బ్రాండ్ల ఉత్పత్తులనే దుకాణాలు/ పార్లర్స్‌లో ఉంచి అమ్ముతున్నారు. అంతే కాదు ప్రైవేటు డెయిరీలు కేజీ ఫ్యాట్‌రేట్ రూ.290–300 నిర్ణయించగా, అదే విజయ రూ.350 చెల్లిస్తోంది. దీంతో ప్రభుత్వ డెయిరీల పాల ఉత్పత్తులకు ఆశించిన స్థాయిలో మార్కెట్ లభించడం లేదు.

రాజకీయ జోక్యంతో..

హయత్‌నగర్‌లోని మదర్ డెయిరీ ప్లాంటును నాలుగు లక్షల లీటర్ల సామర్థ్యంతో ఏర్పాటు చేశారు. రంగారెడ్డి, నల్లగొండ జిల్లాలకు చెందిన సుమారు 28 వేల మంది రైతుల నుంచి రోజుకు సగటున 1.10 లక్షల లీటర్ల పాలు సేకరిస్తున్నారు. నెలకు రూ.4.50 కోట్లకుపైగా బిల్లులు చెల్లించాల్సి ఉంది. 38పైగా అవుట్‌లెట్స్ ఉన్నాయి. రాజకీయ జోక్యానికి తోడు సిబ్బంది నిర్లక్ష్యం, మార్కెటింగ్ వ్యవస్థలో నెలకొన్న లోపం కారణంగా రైతుల నుంచి సేకరించిన పాలను సకాలంలో విక్రయించలేకపోవడంతో రైతులకు బిల్లులు చెల్లించలేని పరిస్థితి నెలకొంది. డెయిరీ నెలకు రూ.50 లక్ష ల నుంచి రూ.కోటి వరకు నష్టాలను చవిచూస్తోంది. ప్రస్తుతం రైతులకు 15 రోజుల డబ్బులు చెల్లించాల్సి ఉంది.

ఉత్పత్తులు అంతంతే..

పాడిరైతులకు చేయూత, నిరుద్యోగులకు ఉపాధి కల్పన, డెయిరీ అభివృద్ధి లక్ష్యంగా నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్‌డీడీబీ) సాంకేతిక సహకారంతో గత ప్రభుత్వం మహేశ్వరం నియోజకవర్గం రావిర్యాలలో 32 ఎకరాల విస్తీర్ణంలో రూ.246 కోట్ల అంచనాతో 8 లక్షల లీటర్ల సామర్థ్యంతో మెగా డెయిరీని ఏర్పాటు చేసింది. రోజుకు నాలుగు లక్షల లీటర్లు సేకరిస్తుండగా, వీటిలో ఒక్క రంగారెడ్డి జిల్లా నుంచే లక్ష లీటర్ల వరకు సరఫరా అవుతోంది. ఇక్కడ పాలప్యాకెట్లు, నెయ్యి, పెరుగు, బటర్‌మిల్క్, లస్సీ, ఫ్లేవర్డ్ మిల్క్, ఐస్‌క్రీం ఇలా 28 రకాల ఆహార పదార్థాలను ఉత్పత్తి చేసే అవకాశం ఉన్నా ఆశించిన స్థాయిలో ఉత్పత్తులు రావడం లేదు. ఫలితంగా ఈ డెయిరీపై ఆధారపడిన రైతులకు నష్టాలు తప్పడం లేదు.

వాటిని నియంత్రిస్తే సరి

మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో లీటరు రూ.35 లోపే దొరుకుతున్నాయి. కొంతమంది డెయిరీ అధికారులు, పాల సేకరణ ఏజెంట్లతో కుమ్మక్కై ఇతర రాష్ట్రాల్లోని రైతుల నుంచి తక్కువ ధరకు పాలను సేకరించి ప్రభుత్వ డెయిరీలకు ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్న పాలను నియంత్రించడం ద్వారా స్థానిక రైతులు పోసే పాలకు మార్కెటింగ్ కల్పించొచ్చు.



– వెంకట్రామ్‌రెడ్డి, పాడిరైతు, కడ్తాల్ మిల్క్ సెంటర్

అప్పులు చేయాల్సిన పరిస్థితి

ఉన్నత చదువులు చదివినా సరైన ఉపాధి అవకాశాలు దొరకని అనేక మంది నిరుద్యోగులు పాడిపరిశ్రమను నమ్ముకుని జీవిస్తున్నారు. కడ్తాల్ ఎంసీసీ నుంచి సుమారు 35 వేల లీటర్లు విజయ డెయిరీకి సరఫరా అవుతున్నాయి. రెండు వేల మంది రైతులు ఈ ఎంసీసీ కేంద్రానికి పాలు పోస్తున్నారు. ఒక్కో రైతుకు రూ.లక్షకుపైగా బిల్లు చెల్లించాల్సి ఉంది. రెండు నెలల నుంచి బిల్లులు రాకపోవడంతో పశువుల దాణా, నిర్వహణ భారంగా మారింది. పాడి రైతులకు రోజువారీ ఖర్చులు, పిల్లల స్కూలు ఫీజుల చెల్లింపునకు అప్పులు చేయయాల్సిన పరిస్థితి ఏర్పడింది.



– కదారి రామకృష్ణ, పాడిరైతు, కడ్తాల్

మార్కెటింగ్ వ్యవస్థ అధ్వానం

ప్రభుత్వ డెయిరీల మార్కెటింగ్ వ్యవస్థ అధ్వానంగా ఉంది. ప్రజల్లో ప్రభుత్వ డెయిరీలపై నమ్మకం ఉన్నప్పటికీ రైతుల నుంచి సేకరించిన పాలకు మార్కెటింగ్ చేయలేకపోతున్నాయి. దుకాణాలకు సరఫరా చేయడంలోనూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. ఫలితంగా పాలు అమ్ముడు పోని పరిస్థితి. మిగిలిన పాలతో ఐస్‌క్రీంలు, ఇతర ఆహార పదార్థాలు తయారు చేసే అవకాశం ఉన్నా పట్టించుకోవడం లేదు. జిల్లాలో రెండు నెలలుగా బిల్లులు రావడం లేదు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. గత ప్రభుత్వం లీటర్‌కు రూ.4 చొప్పున ఇన్సెంటివ్ ఇస్తామని చెప్పినా మూడేళ్లుగా ఇవ్వడం లేదు.

– జి.లక్ష్మయ్య, పాడిరైతు



బెర్త్ ఎవరికో..

హస్తినకు చేరిన 'విస్తరణ'

- మంత్రివర్గంలో చోటుపై ఎమ్మెల్యేల లాబీయింగ్
- ఉమ్మడి జిల్లా కోటాలో ఒకరికి దక్కనున్న అవకాశం
- మల్‌రెడ్డికా.. రామ్మోహన్‌రెడ్డికా అనేదానిపై సర్వత్రా చర్చ
- ఇప్పటికే ఢిల్లీలో మకాం వేసిన ఇద్దరు సీనియర్ నేతలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: మంత్రి వర్గంలో బెర్త్‌ల పంచాయితీ హస్తినకు చేరింది. ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు మంత్రి వర్గంలో చోటు దక్కించుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఢిల్లీ వేదికగా లాబీయింగ్ చేస్తున్నారు. అభిమానులు ఇప్పటికే తమ నేత మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్నట్లు సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేస్తున్నారు. అభినందనలు తెలుపుతూ వాట్సాప్ గ్రూపుల్లో ఫొటోలు షేర్ చేసుకుంటున్నారు. ఈ క్రమంలో ఎవరికి మంత్రి వర్గంలో చోటు లభించనుందనే అంశంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ఒకటి రెండు రోజుల్లో మంత్రి వర్గ విస్తరణ ఉండనున్నట్లు ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం నుంచి గెలుపొందిన రేవంత్‌రెడ్డి ఇప్పటికే సీఎంగా బాధ్యతలు చేపట్టారు. వికారాబాద్ నియోజవర్గం నుంచి గెలుపొందిన గడ్డం ప్రసాద్ కుమార్ అసెంబ్లీ స్పీకర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. రంగారెడ్డి జిల్లా నుంచి ప్రాతినిధ్యం కల్పించ లేదు. తాజా మంత్రివర్గ విస్తరణలో రంగారెడ్డి జిల్లా నేతలకు అవకాశం కల్పించనున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి గెలుపొందిన మల్‌రెడ్డి రంగారెడ్డికి అవకాశం కల్పించనున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఆయన ఢిల్లీకి చేరుకున్నారు. రెండు రోజుల నుంచి అక్కడే మకాం వేశారు. సీఎం రేవంత్‌రెడ్డి కూడా అధిష్టానానికి ఆయన పేరును సిఫార్సు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. వికారాబాద్ జిల్లా పరిగి అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి కూడా పోటీలో ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే ఆ జిల్లా నుంచి ఇద్దరు ఎమ్మెల్యేల్లో ఒకరు సీఎం, మరొకరు స్పీకర్ పదవుల్లో కొనసాగుతున్నారు. మళ్లీ అదే జిల్లాకు చెందిన వ్యక్తికి మంత్రి వర్గంలో చోటు కల్పిస్తే రంగారెడ్డి జిల్లా నేతల నుంచి వ్యతిరేకత వస్తుందనే అభిప్రాయం కూడా ఉంది. దీనిలో భాగంగానే మల్‌రెడ్డికి డిప్యూటీ స్పీకర్ పదవిని కట్టబెట్టనున్నట్లు తెలిసింది. అయితే ఆయన కీలక పోర్ట్ పోలియో కోసం ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. బీఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ మంత్రి సహా మరో ఎమ్మెల్యే కూడా మంత్రి పదవిని ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. అధిష్టానం నుంచి హామీ వచ్చిన వెంటనే వీరు పార్టీ మారే అవకాశం కూడా ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం.

నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు

జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు



ఏబీవీ ఆస్పత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు

షాద్‌నగర్: ప్రైవేటు ఆస్పత్రులకు వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని, నిర్లక్ష్యంగా వైద్యం చేసి రోగాల ప్రాణాలను తీసే వారి ఆస్పత్రులను సీజ్ చేస్తామని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు వైద్యులకు హెచ్చరించారు. పట్టణంలోని ఏబీవీ, బుగ్గారెడ్డి ఆస్పత్రులను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఏబీవీ ఆస్పత్రిలో లేబర్ రూం, థియేటర్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆస్పత్రుల యాజమాన్యాలు అర్హులైన వైద్యులను నియమించుకోవాలన్నారు. ఆపద సమయంలో ప్రైవేటు ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ధనార్జనే ధ్యేయంగా పని చేయొద్దని, నాణ్యతతో కూడిన వైద్యం అందించాలన్నారు. ఆస్పత్రులను తనిఖీ చేసిన వారిలో డిప్యూటీ స్పెంహెచ్ఓలు డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ దామోదర్, జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు, శ్రీహరి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, సురేష్ తదితరులు ఉన్నారు.

రైతు అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి

జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి

చేవెళ్ల: రైతు భరోసాపై అభిప్రాయాలను నమోదు చేసుకొని, వాటిని ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వానికి పంపించనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి వెల్లడించారు. మండలంలోని చేవెళ్ల, ఆలూరు పీఏసీఎస్ పరిధుల్లో బుధవారం వేర్వేరుగా రైతులతో సమావేశమై అభిప్రాయాలు సేకరించారు. ఈ రెండు సొసైటీల పరిధిలో రైతు భరోసా పథకాన్ని పది ఎకరాల వరకు ఇవ్వాలని ఎక్కువ మంది అభిప్రాయపడగా మరికొంతమంది ఐదెకరాల వరకు మాత్రమే ఇవ్వాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇంకొంతమంది సాగు చేసే ప్రతి ఎకరానికి ఇవ్వాలని.. సాగు చేయని భూములకు వర్తించకుండా చూడాలన్నారు. దీంతో పాటు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు, డ్రిప్, విత్తనాలు ఇవ్వాలని కోరారు. రుణమాఫీ కూడా అందరికీ అందించేలా చూడాలని తమ అభిప్రాయలను తెలియజేశారు. వాటన్నింటినీ ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు గీతారెడ్డి వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి, చేవెళ్ల చైర్మన్ డి.వెంకట్‌రెడ్డి, ఆలూరు చైర్మన్ పి.కృష్ణారెడ్డి, చేవెళ్ల డివిజన్ ఏడీఏ రమాదేవి, వ్యవసాయ మండల అధికారి తులసి, ఎంపీటీసీలు, డైరెక్టర్లు, ఈసీఓలు, ఏఈఓలు తదితరుల పాల్గొన్నారు.



కేటీఆర్‌ను కలిసిన సర్పంచ్‌ల సంఘం నాయకులు

పెండింగ్ బిల్లులపై గళమెత్తండి

మాజీ మంత్రి కేటీఆర్‌కు సర్పంచ్‌ల సంఘం నేతల విజ్ఞప్తి

కడ్తాల్: రాష్ట్రంలో పంచాయతీలను పట్టించుకునే నాథుడు లేక పాలన పడకేసిందని సర్పంచ్‌ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహరెడ్డి అన్నారు. సర్పంచ్‌ల సమస్యలపై బుధవారం హైదరాబాద్‌లో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిశారు. పంచాయతీల ప్రస్తుత పరిస్థితిని ఆయనకు వివరించారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామాలు, పట్టణాల అభివృద్ధి ముఖ్యమని చేపట్టిన పల్లెప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పల్లెలు, పట్టణాలకు పైసా విదిల్చింది లేదని, దీంతో గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసిందని అన్నారు. పెండింగ్ బిల్లుల విషయమై ఇటీవల గవర్నర్‌ను కలిసి మొరపెట్టుకున్నా ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పారిశుధ్య కార్మికులకు ఏడు నెలలుగా జీతాలు అందక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న సర్పంచ్‌ల బిల్లులు, పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు తక్షణమే అందించేలా అసెంబ్లీలో తమ గళాన్ని వినిపించాలని కేటీఆర్‌ను కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర నాయకులు ప్రణీల్ చందర్, బొజ్జ రామేశ్వర్‌రెడ్డి, యాదిరెడ్డి, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు గిట్టుబాటు అయ్యేలా చూడాలి

డీఆర్‌డీఓ శ్రీలత

ఇబ్రహీంపట్నం: ఉపాధి కూలీలకు రోజువారీ వేతనం రూ.300 వచ్చేవిధంగా పనులు చేయాలని డీఆర్‌డీఓ శ్రీలత సిబ్బందికి సూచించారు. వన మహోత్సవాన్ని పురస్కరించుకొని రాయపోల్ అటవీ ప్రాంతంలో బుధవారం ఉపాధి హామీ కూలీలతో మొక్కలు నాటేందుకు తీయిస్తున్న గోతులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కూలీలతో కొలతల ప్రకారం గుంతలు పూర్తి చేయిస్తే రూ.300 వస్తాయని, తద్వారా వారికి గిట్టుబాటు అవుతుందని అన్నారు. గృహాల్లో నాటేందుకు పూలు, పండ్ల మొక్కలను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. నీటి సౌకర్యం ఉన్న రైతులకు పండ్ల తోటలు పెంచుకునే అవకాశం ఉందన్నారు. అనంతరం ఇబ్రహీంపట్నంలో ఉన్నతి పేరుతో జ్యువెలరీ తయారీలో శిక్షణ పొందిన మహిళలకు ఆమె ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శిక్షణ పొందిన మహిళలు ఉపాధి పొంది ఆర్థికంగా అభివృద్ధి చేందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీఓ సుభాషిణి, ఏపీడీ సక్రియనాయక్, ఏపీవో తిరుపతాచారి, ట్రైనర్స్ జైప్రకాశ్, రాజేందర్, జయలక్ష్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చేయూతనివ్వండి

చిలుకూరు బాలాజీ దేవాలయం అర్చకుడు రంగరాజన్

మొయినాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మంచి విద్యను అందించేందుకు ఉన్నత స్థాయి, సంపన్న వర్గాలు ముందుకు రావాలని చిలుకూరు బాలాజీ దేవాలయం అర్చకుడు రంగరాజన్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని చిలుకూరు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సొంత నిధులతో బుధవారం నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిలుకూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ప్రైవేటుకు దీటుగా తీర్చిదిద్దడంలో దాతల కృషి ఎంతో ఉందన్నారు. అందరం కలిసి విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు భీమయ్య, ఉపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, రాజశేఖర్, రమాదేవి, రాజు, బాలాజీ సేవా బృందం సభ్యుడు పవన్‌కుమార్ పాల్గొన్నారు.



విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేస్తున్న బాలాజీ దేవాలయం అర్చకుడు రంగరాజన్

జాతీయ అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

ఇబ్రహీంపట్నం రూరల్: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు-2023కు గాను అర్హులైన ఉపాధ్యాయుల నుంచి ఎంహెచ్‌ఆర్‌డీ దరఖాస్తులు ఆహ్వానిస్తుందని జిల్లా విద్యాధికారి సుశీందర్ రావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు కాపీలను డీఈఓ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



శంకర్‌పల్లి: గుర్తు తెలియని ఓ యువకుడి మృతదేహం లభ్యమైన ఘటన బుధవారం మోకిల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ వీరబాబు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని మియాఖాన్‌గడ్డ చౌరస్తా సమీపంలోని పొలం వద్ద సుమారు 27 ఏళ్ల యువకుడి మృతదేహం పడి ఉంది. ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. శవాన్ని చేవెళ్ల ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు.

ధ్యానముద్రలో బుద్ధుడి విగ్రహం



బట్టేల్‌గుట్ట.. జిగేల్‌మనేట్టు

- రెండు వేల మీటర్ల ఎత్తులో గుట్ట బురుజు
- ఆధునికీకరణ పనులకు రూ.2.5కోట్లు

బడంగ్‌పేట్: బడా జంగ్‌పేట్ అంటే నైజాంల సైనిక స్థావరం. చుట్టూ 30 అడుగుల ఎత్తులో కోట గోడ, మధ్యలో సైన్యం, కోటగోడ కింద రాణిగారి నివాసం (కొన్ని ఏళ్లు ఇక్కడే పంచాయతీ పాలన) కోట గోడ మధ్యలో 2వేల మీటర్ల ఎత్తులో బట్టేల్ గుట్ట బురుజును ఏర్పాటు చేశారు. శత్రు సైన్యం రాకను పసిగట్టి ఎదరుదాడి చేసేవారని చారిత్రక ఆధారాలున్నాయి. రాణి నివాసం, స్నాన తటాకం, మెట్లబావి తదితర ఆనవాళ్లు కాలగర్భంలో కలిసినప్పటికీ కోట గోడ ఆనవాళ్లు మిగిలేఉన్నాయి. నాడు బడాజంగ్‌కు సైన్యాన్ని అందించిన బట్టేల్‌గుట్టను పట్టించుకోక పోవడంతో శిథిలావస్థకు చేరింది. మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు కల్పించుకుని బట్టేల్‌గుట్ట అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

చార్మినార్ అందాలు

బడంగ్‌పేటలోని బట్టేల్‌గుట్ట నుంచి చూస్తే చార్మినార్ నాలుగు గుమ్మటాలు కనిపించేవని స్థానికులు చెబుతుంటారు. కాంక్రీట్ జంగిల్ పెరగడంతో ప్రస్తుతం కనిపించడం లేదంటున్నారు. శిథిలమవుతున్న బట్టేల్ గుట్టకు పూర్వవైభవాన్ని తీసుకువచ్చేందుకు బడంగ్‌పేట కార్పొరేషన్ అధికారులు, కార్పొరేటర్లు, ప్రస్తుత ఎమ్మెల్యే సహకారంతో రూ.2.50కోట్లు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టారు. పచ్చికబయళ్లు, పూల మొక్కలు, చుట్టూ ఇనుప కంచెతో పది పీట్ల మేర ప్రహరీ, పాలరాతి దిమ్మెలపై కూర్చుని బట్టేల్ గుట్ట ఫొటో తీసుకునేందుకు ఏర్పాటు చేశారు. బట్టేల్‌గుట్టపై ధ్యాన ముద్రలో ఉన్న పెద్ద బుద్ధిడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. కోట్లు వెచ్చించి గుట్టను అభివృద్ధి చేశారు. అంగరంగ వైభవంగా ప్రారంభోత్సవాలు చేశారు. అక్కడకు అందాల వీక్షణకు మాత్రం అనుమతి లేదు. దీంతో బట్టేల్ గుట్ట సందర్శనకు అనుమతించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



వాకింగ్ ట్రాక్

త్వరలో సందర్శనార్థం



చారిత్రక ప్రాంతమైన బట్టేల్‌గుట్ట మా 30వ డివిజన్‌లో ఉండడం సంతోషం. బడంగ్‌పేటకు ఒక ఐకాన్ ఉండాలని భావించి బట్టేల్ గుట్టను బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ లోగో ముద్రను ఏర్పాటు చేశారు. ప్రస్తుత ఎమ్మెల్యే సబితారెడ్డి కల్పించుకోకపోతే బట్టేల్‌గుట్ట ఇంకా శిధిలావస్థలోనే ఉండేది. త్వరలోనే ప్రజలకు సందర్శనకు అనుమతి కోసం కృషి చేస్తున్నాం.

– భీమిడి స్వప్న, కార్పొరేటర్, 30వ డివిజన్



సదస్సులో మాట్లాడుతున్న గోరెంకల నర్సింహ

చెరువులను సంరక్షించాలి

- మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహ

మంచాల: గ్రామాల్లో రియల్ వ్యాపారం పేరుతో కబ్జాలకు గురవుతున్న చెరువులను ప్రభుత్వం కాపాడాలని మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోరెంకల నర్సింహ డిమాండ్ చేశారు. బుధవారం మంచాల గ్రామంలో నిర్వహించిన మత్స్య కార్మిక సంఘం మండల సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో చెరువులను శాటిలైట్ ద్వారా డిజిటల్ సర్వే చేయించి ఎఫ్‌టీఎల్ హద్దురాళ్లు ఏర్పాటు చేయించాలన్నారు. గత పదేళ్ల కాలంలో చెరువులు పెద్ద ఎత్తున ఆక్రమణకు గురయ్యాయని మండిపడ్డారు. ఆగాపల్లి గ్రామంలో అల్లి చెరువును కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేశారని తెలిపారు. అధికారులు చోద్యం చూడడం తప్ప ఎక్కడ పనులను నిలుపుదల చేయలేదన్నారు. ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించక పోవడం శోచనీయమన్నారు. ఉచిత చేప పిల్లల పంపిణీ పథకం కొనసాగిస్తూ, మత్స్యకారుల సొసైటీల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయాలన్నారు. మత్స్యకారుల సంక్షేమం కోసం రూ.5,000 కోట్లు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు చనమోని శంకర్, జిల్లా నాయకుడు శర్మ, మండల ప్రధాన కార్యదర్శి నర్సింహ, వివిధ గ్రామాల సొసైటీల అధ్యక్షులు, నాయకులు కృష్ణ, యాదగిరి, చక్రపాణి, భిక్షపతి, గిరిప్రసాద్, శ్రీనివాస్, జంగయ్య, భాస్కర్, యాదయ్య, హన్మంత్, రవి, కృష్ణ, పాపయ్య, జగన్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

'రైతు భరోసా'కే అభిప్రాయ సేకరణ



తలకొండపల్లి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు/తలకొండపల్లి: రైతుకు భరోసా ఇచ్చేందుకు ప్రభుత్వం రైతుల నుంచి అభిప్రాయాలను సేకరిస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని పడకల్ గేట్ సమీపంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సహకార సంఘం ఆధ్వర్యంలో రైతు భరోసా పై రైతులు, ప్రజల అభిప్రాయాలను సేకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగాహాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రుణమాఫీ చేస్తామని, సాగు చేసే ప్రతీ ఎకరాకు రైతు భరోసా అందిస్తామని.. రైతుబీమా అమలు చేస్తామన్నారు. అనంతరం పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి రైతుల అభిప్రాయాన్ని చెప్పాలని కోరారు. సాగు ప్రారంభానికి ముందే పెట్టుబడులకు అందేలా రైతు భరోసా ఇవ్వాలని పలువురు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార సంఘం అధికారి కేఎల్‌ఎస్ చారి, సహకార సంఘం జిల్లా అసిస్టెంట్ రిజిస్ట్రార్ శారద, ఏఓ రాజు, శతాబ్ది శ్రీనివాస్ రెడ్డి, సింగిల్‌విండో సీఈఓ ప్రతాప్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, సొసైటీ డైరెక్టర్లు యాదయ్య, శ్రీనివాసులు, దేవులానాయక్, ఎంపీటీసీ సభ్యులు రమేశ్, సుధాకర్‌రెడ్డి, పీసీసీ కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, భగ్‌వాన్‌రెడ్డి, శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత

గ్రామాలు, తండాల్లో రోడ్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శెట్టిపల్లి మాజీ సర్పంచ్ ఎగిరిశెట్టి సత్యం బుధవారం నగరంలోని ఎమ్మెల్యే నివాసంలో కసిరెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. వేముల చెరువు కట్టపై రోడ్డు నిర్మించాలని కోరారు. వీరన్న చెరువు చెక్‌డ్యాంకు ఫీడర్ కాలువ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం డీ-82 కాలువ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందిస్తామని, త్వరగా సాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే వివరించారు. ప్రభుత్వాసుపత్రులను ఆధునీకరించాలని, పక్కా భవనాలు నిర్మించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి దామోదర రాజనర్సింహను కోరానని కసిరెడ్డి చెప్పారు.

బీమా టోకరా

- కొత్త పాలసీలు, రెన్యూవల్ పేరిట మోసాలు
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: బీమా పాలసీలు, రెన్యూవల్ పేరుతో వచ్చే సందేశాలు, ఫోన్ కాల్స్, లింకులకు ముందు వెనకా చూసుకోకుండా స్పందిస్తే నిండా మునిగినట్టే. బహుమతులు, ఉద్యోగాలు, బీమా బదలాయింపులు, సాంకేతిక సమస్యల సాకుతో, రెన్యూవల్ పేరుతో సైబర్ నేరగాళ్లు వల విసురుతున్నారు. ప్రముఖ బీమా కంపెనీల పేర్లతో నకిలీ ఈ-మెయిల్స్, సందేశాలు పంపి డబ్బు కొల్లగొడుతు సంఘటనలు ఇటీవల కాలంలో పెరిగిపోయాయని సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపారు. బాధితుల్లో ఎక్కువ మంది విద్యా వంతులు, వృద్ధులు ఉండటం గమనార్హం.

ప్రొవైడర్ల నుంచి డేటా కొనుగోలు..

బీమా వివరాలు, వాటి గడువు, ఇతరత్రా సమాచారం ఇటు పాలసీదారులకు, అటు బీమా సంస్థలకు మాత్రమే తెలుస్తాయి. సైబర్ నేరగాళ్లు ఈ వ్యక్తిగత సమాచారాన్ని అడ్డదారుల్లో కొంటున్నారు. డేటా ప్రొవైడర్లు, బ్రోకింగ్ కంపెనీలు రూ.10 వేలు ఇస్తే.. లక్షలాది మంది బీమా వివరాలను అందిస్తున్నాయి. ఇందులో పాలసీ వివరాలు, వాటి గడువు, వాహనాల నంబర్లు, వాటి ఇన్సూరెన్స్ పాలసీలు ఇలా పూర్తిగా వ్యక్తిగత వివరాలు ఉంటున్నాయి. ఈ సమాచారంతో సైబర్ నేరగాళ్లు పాలసీదారులకు ఫోన్లు, మెసేజ్‌లు చేసి కొత్త బీమా, రెన్యూవల్‌తో అధిక లాభాలు, బహుమతులు అందుకోవచ్చని నమ్మించి బ్యాంకు ఖాతా వివరాలను సేకరిస్తున్నారు. వీటితో అకౌంట్లు ఖాళీ చేసేస్తున్నారు.

జాగ్రత్తలివే..

- రెన్యూవల్, పాలసీ బదలాయింపు పేరుతో వచ్చే ఈ-మెయిల్స్, సందేశాలను నమ్మకూడదు.
- బీమా పాలసీలో మార్పులు చేసుకోవాల్సి వస్తే సదరు బీమా సంస్థను సంప్రదించాలి.
- ఇన్సూరెన్స్ వెరిఫికేషన్ కోసమని చెప్పి మీ పాన్, ఆధార్ నంబర్లు, బ్యాంకు వివరాలను అడిగితే.. అది సైబర్ మోసమేనని గుర్తించాలి.

హాస్టల్ ఏర్పాటుకు వినతి




సోషల్ వెల్ఫేర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న శంకర్ తదితరులు

ఆమనగల్లు: పట్టణంలో ఇంటర్, డిగ్రీ చదువుతున్న విద్యార్థుల కోసం షెడ్యూల్ కులాల సంక్షేమ కళాశాల హాస్టల్ ఏర్పాటు చేయాలని సోషలిస్ట్ విద్యార్థి సంఘం కోఆర్డినేటర్ జంతుక శంకర్ కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివలింగం, నాయకులు శంకర్‌గౌడ్ తదితరులున్నారు.

బాలుడిని కొట్టిన వ్యక్తికి రిమాండ్

షాబాద్: పది రోజుల క్రితం మండల పరిధిలోని కేసారం గ్రామంలో 7వ తరగతి చదువుతున్న దళిత విద్యార్థి బేగరి యాదగిరిపై అదే గ్రామానికి చెందిన మధుసూదన్‌రెడ్డి దాడి చేశారు. ఈ ఘటనలో బుధవారం మధుసూదన్‌రెడ్డి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ కాంతారెడ్డి అన్నారు.

అజీజ్‌నగర్‌ను సందర్శించిన ట్రైనీ ఐఈఎస్‌లు



అజీజ్‌నగర్‌లో ఇండియన్ ఎకనామిక్స్ సర్వీసెస్ ట్రైనీ అధికారులు

మొయినాబాద్ రూరల్: మండల పరిధిలోని అజీజ్‌నగర్ పంచాయతీని ఎన్ఐఆర్‌డీ పీఆర్ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ రూరల్ డెవలప్‌మెంట్ పంచాయతీ రాజ్) న్యూఢిల్లీ బృందం ఆధ్వర్యంలో ఇండియన్ ఎకనామిక్స్ సర్వీస్(ఐఈఎస్) 2024 బ్యాచ్ ట్రైనీ అధికారులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారికి పంచాయతీ కార్యదర్శి రంజిత్‌కుమార్ గ్రామంలో జరిగిన అభివృద్ధి పనులను, సంక్షేమ పథకాలను వివరించారు. మహిళా సంఘాల అధ్యక్షులు సంఘాల అభివృద్ధిని వివరించారు. అనంతరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. గ్రామ సమీపంలోని నర్సరీ, డంపింగ్ యార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్ఐఆర్‌డీపీఆర్ ప్రొఫెసర్ పార్థప్రతిమ్ సాహు మాట్లాడుతూ.. 17 మంది ట్రైనీ అధికారులకు వారం రోజులు రాజేంద్రనగర్ ఎన్ఐఆర్‌డీలో అవగాహన పెంచుకుంటారన్నారు. మహారాష్ట్ర, రాజస్థాన్, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్,పంజాబ్, కేరళ ఏడు రాష్ట్రాలకు చెందిన ట్రైనీ అధికారులు ఇందులో పాల్గొన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో బిల్ కలెక్టర్ శ్రావణ్‌కుమార్, సిబ్బంది రాఘవేందర్, రాజు, సుధాకర్, మల్లమ్మ, ఎన్ఐఆర్‌డీ సిబ్బంది సరస్వతి అర్చన్, మహిళా సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి చోరీకి విఫలయత్నం

యాచారం: హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కుర్మిద్దలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి విఫలయత్నం చేశారు. పోలీసులు తెలిపిన ప్రకారం మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గ్రామానికి చెందిన అనమోని రోశయ్య ఇంట్లో చోరీ చేసేందుకు వచ్చారు. గమనించిన కుటుంబ సభ్యులు కేకలు వేయడంతో వారు పరారయ్యారు. ఈ మేరకు బుధవారం రోశయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

యువకుడిపై పోక్సో కేసు

లింగంపేట(ఎల్లారెడ్డి): ప్రేమ పేరుతో బాలికను మోసం చేసిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. కామారెడ్డి జిల్లా లింగంపేట మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఆయన కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికకు రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం ఉప్పుగూడకు చెందిన కాలె భాస్కర్‌తో ఇన్‌స్టాగామ్‌లో పరిచయమైంది. బ్లూ డార్ట్ కంపెనీ(శంషాబాద్ ఎయిర్ పోర్టు)లో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్న భాస్కర్ పెళ్లి చేసుకుంటానని నమ్మించడంతో సదరు బాలిక ఇంట్లో ఎవరికీ చెప్పకుండా హైదరాబాద్‌కు వెళ్లిపోయింది. ఇద్దరూ కలిసి గండిమైసమ్మ ప్రాంతంలో రూము అద్దెకు తీసుకొని ఉంటున్నారు. ఇదిలా ఉండగా, బాలిక తండ్రి తన కూతురు కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా బాలిక ఉంటున్న ప్రదేశాన్ని గుర్తించారు. భాస్కర్‌ను అదుపులోకి తీసుకొని విచారణ అనంతరం పోక్సో కేసు నమోదు చేశారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో ఎస్సై చైన్యకుమార్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రేటర్ సమగ్ర అభివృద్ధి కోసమే 'హై సిటీ'

పథకాల పేరు మార్పుపై జీహెచ్‌ఎంసీ

సాక్షి, సిటీబ్యూరో: గత ప్రభుత్వ హయాంలో ఎస్సార్‌డీపీ, ఎస్ఎన్‌డీపీ తదితర పేర్లతో ఉన్న పథకాల పేర్లను తొలగించడంపై జీహెచ్‌ఎంసీ ప్రకటన విడుదల చేసింది. ఆ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అసంపూర్తి పనులు పూర్తి చేయడం, మరింత అభివృద్ధికి నూతన పనులను ప్రతిపాదిస్తూ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సకాలంలో పూర్తిచేయడం ఈ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొంది. అందుకు గాను వివిధ పథకాలను అమలు చేసే బదులు ఒకే గొడుగు కింద సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిన పథకమే ' హై సిటీ' (హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ ట్రాన్స్ ఫార్మేటివ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) అని వివరణ నిచ్చింది. గత ప్రభుత్వ పథకాల పేర్ల రద్దుకు సంబంధించి 'వ్యూహాత్మకంగానే' శీర్షికన మే 31వ తేదీన 'సాక్షి' కథనం వెలువరించింది. గ్రేటర్ హైదరాబాద్‌లో కనీస సౌకర్యాలు, మౌలిక వసతుల కల్పన, సమగ్ర అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం హై సిటీ పథకానికి రూపకల్పన చేసిందని తెలిపింది. అంతర్జాతీయంగా హైదరాబాద్ ఇమేజ్‌ను కొనసాగించడం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆశయమని పేర్కొంది. గతంలో చేపట్టిన పనులు పూర్తయ్యేందుకు, ఇప్పటి అవసరాల కనుగుణంగా ప్రాధాన్యంగల పనులపై ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సిందిగా తెలంగాణ ప్రభుత్వం జీహెచ్‌ఎంసీ అధికారులను ఆదేశించినట్లు తెలిపింది. అందుకనుగుణంగా నాలాల అభివృద్ధికి రూ.582.42 కోట్లతో 35 పనులు చేయాలని అధికారులు నిర్ణయించినట్లు వివరించింది. ఆ మేరకు జోన్ల వారీగా చేయనున్న పనుల గురించి తెలిపింది.

జీవో నంబర్ 121ను రద్దు చేయాలి

ముషీరాబాద్: గత ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 121ను రద్దు చేసి వీఆర్‌ఓలను రెవెన్యూ శాఖలోకి తీసుకురావాలని తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు గరిగె ఉపేందర్‌రావు సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదం వల్ల వీఆర్‌ఓల పరిస్థితి అధ్వానంగా తయారైందని వాపోయారు. బుధవారం రాంనగర్‌లోని ఎస్‌ఆర్‌టీ కాలనీ కమ్యూనిటీహాల్‌లో తెలంగాణ వీఆర్‌ఓల సంక్షేమ సంఘం రాష్ట్ర సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం వీఆర్‌ఓలను రద్దుచేసి వివిధ శాఖల్లో నిర్వీర్యమైన పోస్టులు ఇచ్చి తమ జీవితాలను చిన్నాభిన్నం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం వీఆర్‌ఓలను రెవెన్యూశాఖలో చేర్చి వారికి ఇంక్రిమెంట్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఉద్యోగంలో చనిపోయిన వీఆర్‌ఓల పిల్లలకు కారుణ్య నియామకాలు జరపాలని కోరారు. వీఆర్‌ఓల అర్హతలను బట్టి ప్రమోషన్లు కల్పించాలన్నారు. తమ సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలు వెంటనే స్పందించి న్యాయం చేయాలని లేదంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సంఘం ఉపాధ్యక్షుడు కృష్ణ, కోశాధికారి ప్రసాద్‌బాబు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు విజయనాథ్, వివిధ జిల్లాల అధ్యక్షులు ప్రకాష్‌రావు, వీరస్వామి, కృష్ణమూర్తి, వెంకటేష్, నర్సింహులు, గోవర్ధనచారి, కృష్ణమ్మ, రాఘవేందర్, మద్దిలేటి తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు గరిగె ఉపేందర్‌రావు